బైబులు భాష్యం - 185
జనవరి - ఫిబ్రవరి 2009

# పునీత పౌలు బోధలు - 2

సంపాదకుడు :
**ఫాదర్ పి. జోజయ్య, S.J.**
ఆంధ్ర లొయోలా కాలేజి
విజయవాడ - 520 008
ఫోను - (0866)-2476329

# 7. బైబుల్లో ఏముంది?

## 1. బైబులు పేర్లు

బైబులు రచయితలు పవిత్రగ్రంథానికి దేవుని వాక్కు అని పేరుపెట్టారు. వాక్కు కనుక అది ఓభాషలో వుంటుంది. ఆ భాష నరునికి అర్థమౌతుంది. ఆ భాషను మాటలాడినవాడు భగవంతుడే. అతడు నరమాత్రులద్వారా ఆ భాషను మాటలాడాడు.

ఈ గ్రంథానికి లేఖనాలు, పుస్తకపు చుట్టలు అనికూడ పేరు. పవిత్రగ్రంథం నరులచే వ్రాయబడినది. కనుక మామూలు పుస్తకాలకు వుండే గుణాలు దానికి కూడ వుంటాయి.

ఈ పుస్తకానికి ధర్మశాస్త్రం అని కూడ పేరు. ప్రభువు పూర్వం సీనాయి కొండదగ్గర మోషే ద్వారా ధర్మశాస్త్రాన్ని దయచేసాడు. దీనిలో అనేక నియమాలున్నాయి. ప్రజలు ఈ నియమాలను పాటించాలి. బైబులు జీవిత సూత్రాలనూ, నియమాలనూ నేర్పే గ్రంథం.

అసలు బైబులంటే పుస్తకం అని అర్థం. పుస్తకాలు అనే అర్థం కల "బిబ్లియా" అనే ల్యాటిన్ మాటనుండి బైబులు అనే పదం వచ్చింది. ఇది ఒక పుస్తకం కాదు. చాల గ్రంథాల సముదాయం. చాల శతాబ్దాల పొడుగున రచయితలు ఈ పుస్తకాలను వ్రాసారు.

బైబుల్లో ప్రాతనిబంధనం, నూత్న నిబంధనం అని రెండు భాగాలున్నాయి. ప్రాత నిబంధనం దేవుడు సీనాయి కొండదగ్గర మోషే ద్వారా ప్రజలతో కుదుర్చుకొనిన పొత్తును గూర్చి చెప్తుంది. నూత్న నిబంధనం దేవుడు క్రీస్తు ద్వారా, ప్రజలతో కుదుర్చుకొనిన పొత్తును గూర్చి చెప్తుంది. ఈ రెండిటికీ దగ్గరి సంబంధం వుంది. పాత నిబంధనం వాగ్దానం. నూత్ననిబంధనం నెరవేరుదల.

బైబులుకి దైవోక్తులు అనికూడ పేరు. అవి దేవుడు పలికిన పలుకులు. కనుక మనకు ఆచరణీయాలు. ఇంకా దానికి దివ్యశ్రుతి

అని కూడ పేరు. అనగా దేవుడే దివ్యసత్యాలను నరులమైన మనకు తెలియజేసాడని భావం.

బైబులు తన లక్షణాలను కొన్నిటిని తానే చెప్పుకుంటుంది. అది పవిత్ర లేఖనాలు -2తిమొ 3,15. అది ప్రవచనం. అనగా నరులను నుండి కాక దేవుని నుండి ఉద్భవించింది -2 పేతు 1,21. అది దీపం. అనగా మనకు దారి చూపేది - కీర్త 119,105. అది సజీవమైంది - హీబ్రూ 4,12. అది అద్దం - యాకో 1,23. అనగా దానిలోమనలను మనం చూచుకోవచ్చు. ప్రజలు బైబులు వాక్కుని స్వీకరించాలి, నమ్మాలి, ధ్యానం చేసికోవాలి, అనుసరించాలి.

## 2. బైబుల్లోని ముఖ్యాంశాలు

బైబులు దేవుణ్ణి గూర్చి, నరుని గూర్చి చెప్తుంది. ప్రధానంగా దేవుణ్ణి వర్ణిస్తుంది. భగవంతుడు ఏలాంటివాడో, అతడు తన్ను గూర్చితాను ఏమి తెలియచేసి కొన్నాడో, అతడు నరుల కొరకు ఏమి చేస్తాడో విశదీకరిస్తుంది. నరుణ్ణి గూర్చి కూడ చాల విషయాలు చెప్తుంది. నరుల్లో శరీరం ఆత్మ అనే రెండు అంశాలున్నాయనీ, వాళ్లు తాము చేసిన మంచి పనులకూ చెడ్డ పనులకూ గూడ బాధ్యులౌ తారని తెలియజేస్తుంది.

ఇంకా దేవునికీ నరులకీ గల నింతర సంబంధాన్నీ చూపిస్తుంది. నరుడు దేవుణ్ణి ఆశ్రయించాలి. దేవుడు తన తరపున తాను నరుణ్ణి ప్రీతితో ఆదరిస్తాడు. దేవునికీ నరునికీ గల సంబంధమే నిబంధనం. ఈ సంబంధాన్ని చెరిచేది నరుని పాపం.

నరులు చెడ్డను చేసి దాని వలన నానా శ్రమలు అనుభవిస్తారు. ఈ యంశాన్ని గూడ బైబులు విపులంగా పేర్కొంటుంది.

ఇంకా బైబుల్లో దేవుడు చేసిన క్రియలు స్పష్టంగా కన్పిస్తాయి. అవి దేవుడు సృష్టిచేయడం, ప్రాణులను పోషించడం. ఈఇష్ట విమోచనం, రక్షణం మొదలైనవి. ఆలాగే నరులు చేసే మంచి క్రియలు చెడ్డ క్రియలూ కూడ పేర్కొంటుంది. దేవుని క్రియలకూ నరుల క్రియలకూ దగ్గరి సంబంధం వుంటుంది. ఈ రెండింటినీ

కలిపి తీసికొంటే బైబుల్లో కన్పించే ముఖ్యాంశాలు ఇవి. సృష్టి, తొలిపాపం, నిర్గమనం, నిబంధనం, రాజుల పరిపాలనం, బాబిలోనియా ప్రవాసం, ప్రవాసం నుండి తిరిగి రావడం, క్రీస్తు జననం, బోధలు అద్భుతాలు మరణోత్థానులు, తిరుసభ వ్యాప్తి క్రైస్తవ జీవితం, అంత్యగతులు మొదలైనవి.

బైబుల్లో ఐక్యతాభావం గోచరిస్తుంది. ప్రాత నిబంధనలో చెప్పిన విషయాలు నూత్న నిబంధనంలో నెరవేరతాయి. యావే ప్రభువు, క్రీస్తూ వేరువేరు దేవుళ్లు కాదు, ఒకే దేవుడు. బైబులు కథకూడ ఒకే రక్షణ గాథ. అది సృష్టితో ప్రారంభమై నరుని అంత్యగతులతో ముగుస్తుంది. బైబులు చివరకు చెడ్డ వోడిపోయి మంచి గెలుస్తుందని చెప్తుంది. అసలు బైబులంతా చెడ్డకూ మంచికీ కలిగే ఘర్షణను గూర్చే.

బైబుల్లోని ప్రధానమైన వ్యక్తి భగవంతుడు. అతడు నరుల పాపాన్ని తొలగించి వారికి రక్షణను దయచేస్తాడు. సంగ్రహంగా చెప్పాలంటే ఈ రక్షణ గాథే బైబులు. పవిత్ర గ్రంథాన్ని భక్తిశ్రద్ధలతో పఠించి అది బోధించే భగవంతుణ్ణి విశ్వసించి అతనినుండి ముక్తిని పొందడమే ఇప్పుడు మనం చేయవలసిన పని.

విషయసూచిక

**3. ఫిలిప్పీయుల జాబు**

**4. ఎఫెసీయుల జాబు**

**5. కొలొస్సీయుల జాబు**

**6. రోమా పౌరులు జాబు**

# 3. ఫిలిప్పీయుల జాబు

## 1. పరిచయం

పౌలు 55 ప్రాంతంలో, బహుశ ఎఫేసు చెరనుండి ఈ జాబు వ్రాసాడు. ఫిలిప్పి మాసెడోనియా రాష్ట్రంలోని నగరం. పౌలు రెండవ ప్రేషిత ప్రయాణంలో ఇక్కడ వేదబోధచేసి క్రైస్తవసంఘాన్ని స్థాపించాడు. యూరపులో మొట్టమొదటిసారిగా వేదబోధ జరిగింది ఈ నగరంలోనే.

ఇది ఒకజాబు కాదు. మూడు జాబుల సమ్మేళనం. ఎవరో సంపాదకుడు వీటిని కలిపివేసాడు.

జాబు వ్రాసిన సందర్భం ఇది. యూదమతాభిమానులు పౌలుకి వ్యతిరేకంగా బోధిస్తున్నారు. కనుక సమాజాన్ని హెచ్చరిస్తూ పౌలు ఈ జాబు వ్రాసాడు. ఇంకా, ఆ సంఘంలో తగాదాలు వున్నాయి. అక్కడ ఇద్దరు నాయకురాళ్లు పోట్లాడుకొంటూన్నారు. సంఘానికి ఐక్యతను బోధించడానికి గూడ ఈ లేఖ వ్రాసాడు. పైగా, ఫిలిప్పీయులు పౌలుకి ఆర్థిక సహాయం చేసారు. వారికి కృతజ్ఞత తెల్పడానికి కూడ ఈ లేఖ వ్రాసాడు.

ఈ జాబుకి ఓ ప్రత్యేకతవుంది. ఇది సంతోషభావాలతో నిండి వుంటుంది. పౌలు ఫిలిప్పి విశ్వాసులను మీరు ప్రభువునందు ఆనందించండి అని చెప్పాడు -3,1. ఇంకా, పౌలుకి ఫిలిప్పీయులంటే యిష్టం. అతడు వారి పట్ల ప్రేమ, ఆప్యాయత వెల్లడి చేసాడు. మీరు నా ఆనందం అని పేర్కొన్నాడు - 4,1.

## 2. క్రీస్తు గీతం 2,6-11

ఈ గీతాన్ని పౌలు స్వయంగా వ్రాయలేదు. దీన్ని ఆనాడు దైవార్చనలో పాటగా పాడేవాళ్లు. తన భావాలను వ్యక్తం చేయడానికి బాగా సరిపోతుందన్న ఉద్దేశంతో పౌలు దీన్ని ఇక్కడ వాడుకొన్నాడు.

అసలు పౌలు దీన్ని ఇక్కడ ఎందుకు పేర్కొన్నాడు? ఫిలిప్పీయులు గర్వంతో పెద్దపదవులు ఆసిస్తున్నారు. వారికి వినయంలేదు. ఇంకా ఎవరిలాభం వాళ్లు చూచుకొంటున్నారు. అంతఃకలహాలతో సమాజంలో విభజనలు తెచ్చిపెడుతున్నారు -2,3-4. వాళ్లు క్రీస్తు నుండి వినయమూ స్వార్థత్యాగమూ అనే రెండు గుణాలు నేర్చుకోవాలి. క్రీస్తు మనస్తత్వాన్ని అలవర్చుకోవాలి అని చెప్తూ ఈ గీతాన్ని ఉదాహరించాడు - 2,5.

ఈ పాటలో మూడంశాలు వున్నాయి. 6 చరణం క్రీస్తు పరలోక జీవితాన్ని వర్ణిస్తుంది. 7-8 చరణాలు అతని నరావతారాన్నీ వినయాన్నీ వర్ణిస్తాయి. 9-11 చరణాలు తండ్రి క్రీస్తుని మహిమపరచడాన్ని వర్ణిస్తాయి.

ఇక ఈ పాట మీద వివరణం చూద్దాం. 6. క్రీస్తు నరావతారానికి ముందు పరలోకంలో దేవునితో తనకున్న సమానత్వాన్ని స్వార్థబుద్ధితో దక్కించు కోవాలనుకోలేదు. పూర్వం ఆదాము దేవునికి సరిసమానం కావాలనుకొని జ్ఞానవృక్షఫలం తిన్నాడు. అతడు నరుడైకూడ గర్వంతో దేవుణ్ణి కావాలనుకొన్నాడు. క్రీస్తు దేవుడై కూడా అణకువతో ఆ దైవత్వాన్ని వదలుకొన్నాడు. ఇద్దరికీ వ్యత్యాసం వుంది.

7. క్రీస్తు తన్నుతాను ఖాళీచేసికొని బానిస రూపాన్ని పొందాడు. అతడు వదలుకొంది దైవత్వాన్ని. చేకొంది నరత్వాన్ని. బానిసలకు శక్తీ అధికారమూ వుండవు. క్రీస్తు కూడ ఆలాగయ్యాడు.

8. క్రీస్తు వినయం మరణందాకా పోయింది. అది కూడ నీచాతినీచమైన సిలువమరణం. ఆనాడు దాసులకూ ద్రోహులకూ సిలువమరణం విధించే వాళ్లు. క్రీస్తు ఈలాంటి మరణానికి

పొల్పడ్డాడు. పూర్వం బాధామయసేవకుడు ఈలా మరణించాడు. క్రీస్తు ఈ సేవకుని పోలినవాడు.

9. క్రీస్తు వినయానికి మెచ్చుకొని తండ్రి అతన్ని అధికంగా హెచ్చించాడు. అతన్ని ఉత్థానంజేసి మహిమ పరచాడు. అన్ని నామాలకంటే గొప్పనామాన్ని అతనికి ప్రసాదించాడు. అది "ప్రభువు" అనే నామం. దీనికి హిబ్రూలో యావే అనీ, గ్రీకులో కూరియోస్ అనీ పేర్లు. ప్రభువు అనే పేరు పూర్వవేదంలో తండ్రికి మాత్రమే చెల్లుతుంది. ఆ బిరుదాన్ని తండ్రి క్రీస్తు కిచ్చి సత్కరించాడు. అనగా అతడు తండ్రికి సరిసమానమయ్యాడు. వినయంవల్ల బానిస ప్రభువయ్యాడు. ఇక్కడ ప్రభువు అంటే సర్వసృష్టికి పాలకుడు అని అర్థం.

10. మూడులోకాల్లోని ప్రాణులు అనగా స్వర్గంలోని సన్మనస్కులూ, భూమిమీది నరులూ, పాతళంలోని మృతులూ క్రీస్తుకి మోకాలు వంచి దండంపెడతారు.

11. తండ్రి కీర్తి కొరకే క్రీస్తు ప్రభువు అయ్యాడని అందరూ ప్రకటిస్తారు. క్రీస్తు మహిమ తండ్రికే కీర్తిని చేకూరుస్తుంది. క్రీస్తు సర్వసృష్టికి అధిపతి. తండ్రికి సరిసమానుడు. ఐనా ఇద్దరు దేవుళ్లు కాదు, ఒకే దేవుడు.

ఆదాము గర్వం ద్వారా మనకు పాపమూ చావు తెచ్చిపెట్టాడు. కాని క్రీస్తు వినయం ద్వారా మనకు రక్షణాన్ని తెచ్చిపెట్టాడు.

పూర్వం బాధామయ సేవకుడు శ్రమలు అనుభవించి మహిమను పొందాడు - యెష 53. ఆ సేవకుడు క్రీస్తునే సూచిస్తాడు.

పిలిప్పీయులు క్రీస్తులాగ వినయమూ, స్వార్థత్యాగమూ, సేవాగుణమూ అలవర్చుకోవాలని పౌలు హెచ్చరించాడు. ఈ గీతం క్రీస్తు దైవత్వాన్ని కాక అతడు నేర్పిపోయిన నైతిక సూత్రాలను వర్ణిస్తుంది. ఈ పాట పౌలు సుప్రసిద్ధ బోధల్లో వొకటి. ఇప్పుడు మనకు కూడ ప్రేరణం పుట్టిస్తుంది. పాఠకులు దీన్ని పలుసార్లు భక్తితో మననం జేసికోవాలి.

### 3. క్రీస్తు అన్నిటికంటె పై విలువ 3,5-11.

పౌలుకి యూదమతంలో వున్నపుడు గొప్పలు చాలవున్నాయి. అతనికి సున్నతి జరిగింది. అతడు ప్రసిద్ధమైన బెన్యామీను గోత్రీయుడు. హిబ్రూ లేక అరమాయిక్ భాష మాట్లాడేవాడు. యూదుల్లో అగ్రవర్గమైన పరిసయుల శాఖకు చెందినవాడు. క్రైస్తవులను హింసించి పేరు తెచ్చుకొన్నవాడు. ధర్మశాస్త్రాన్ని ఖండితంగా పాటించి దానివల్ల రక్షణం కలుగుతుందని నమ్మినవాడు ఇవన్నీ అప్పుడు అతని గొప్పలు, లాభాలు.

కాని అతడు క్రైస్తవుడు అయ్యాక ఈ లాభాలన్నీ నష్టాలయ్యాయి. క్రీస్తును గూర్చిన అనుభవజ్ఞానంతో పోలిస్తే అతని పూర్వలాభాలన్నీ విలువలేనివి. క్రీస్తుతో పోల్చి చూస్తే ఆ గొప్పలన్నీ చెత్తాచెదారంలాగ, అనగా కసువులాగ నిష్ప్రయోజనమైనవి. కసువుకి ఏమి విలువ వుంటుంది? చిమ్మి అవతలపారేస్తాం గదా! గ్రీకు మూలంలో ఈ "కసువు" అనే పదానికి మలం అని కూడ అర్థం వుంది. అనగా అతని పూర్వపు గొప్పలన్నీ పెంటతో సమానమని అర్థం. క్రీస్తే విలువలన్నిటిలో పై విలువ. ఆ ప్రభువుని సంపాదించుకొంటే చాలు.

నీతి లేక రక్షణం ధర్మశాస్త్రాన్ని పాటించడంవల్ల రాదు. అది నరులు స్వీయసాధనతో సాధించేదికాదు. దేవుడే దాన్ని ఉచితంగా ఈయాలి. నరుడు క్రీస్తుని విశ్వసించి, అతనిలోనికి జ్ఞానస్నానం పొంది దాన్ని సాధించాలి.

జనుడు రక్షణాన్ని పొందాలంటే క్రీస్తుతో ఐక్యంకావాలి. మొదట అతని శ్రమల్లోను మరణంలోను పాలు పొందాలి. అతనిలాగే మనమూ శ్రమలు అనుభవించాలి. ఆ పిమ్మట అతని ఉత్థానంలో పాలు పంచుకోవాలి. ఇప్పుడు పౌలు చేసే కృషి అంతా ఇదే. క్రీస్తుని గూర్చిన జ్ఞానాన్ని సాధించాలని అతని పట్టుదల. అనగా ప్రభువుని అనుభవ పూర్వకంగా, ప్రేమ పూర్వకంగా, తెలిసికోవాలని అతని తపన.

ఈ వేదభాగం చాల లోతైంది. క్రీస్తుపట్ల అపారమైన భక్తిని పుట్టించేది. ఆ ప్రభువు మన విలువలన్నిటిలోను పై విలువ కావాలి. అతని కొరకు మనం అన్నీ వదలుకోవాలి. వేటి కొరకు కూడ అతన్ని వదులుకోకూడదు. అతడు మన ఆణిముత్యం, నిధి.

మన జీవితం, శ్రమలు, మరణం క్రీస్తు జీవితం శ్రమలు మరణంతో కలసి పునీతం కావాలి. ఇప్పుడు మనం పవిత్రులం అయ్యే మార్గం ఇది. కనుకనే పౌలు ఇప్పుడు నాకు జీవించడమంటే క్రీస్తుని జీవించడమే అని చెప్పుకొన్నాడు - 1,21. జ్ఞానస్నానం పొందినప్పటి నుండి పౌలు క్రీస్తులోను, క్రీస్తు పౌలులోను జీవిస్తున్నారు. అతడు క్రీస్తుతో పూర్తిగా ఐక్యమైపోయాడు. జీవితకాలమంతా అతన్ని బోధిస్తున్నాడు. ఇంకా, ఇప్పుడు జీవించేది నేను కాదు, నాయందు క్రీస్తే జీవిస్తూన్నాడు అని చెప్పుకొన్నాడు - గల2,20. అనగా తాను పూర్వపు యూదుల్లాగ జీవించడం లేదు, క్రీస్తు భక్తుల్లాగ జీవిస్తున్నాడు. ప్రభువుని అనుభవానికి తెచ్చుకోవడం ఈలా వుంటుంది.

# 4. ఎఫెసీయుల జాబు

## 1. పరిచయం

ఈ జాబులో దీన్ని పౌలు చెరనుండి వ్రాసినట్లుగా వుంటుంది. ఎఫెసు సంఘానికి వ్రాసినట్లుగా వుంటుంది. కాని అసలు పౌలు దీన్ని వ్రాయలేదు. అతని శిష్యుడు ఎవరో దీన్ని పౌలు పేరుమీదిగా వ్రాసాడు. నిజానికి ఈ లేఖ ఎఫెసుకి వ్రాసింది కాదు. ఇది ఆనాటి అన్ని సంఘాలకు ఉద్దేశింపబడిన సార్వత్రిక లేఖ. 95 ప్రాంతంలో దీన్ని వ్రాసినట్లుగా తెలుస్తుంది.

క్రైస్తవులు క్రీస్తుతో ఐక్యమై జీవించాలి అనేది దీనిలోని ముఖ్యాంశం. ఈ భావాన్ని విశదం చేయడానికి రచయిత కొన్ని ఉపమానాలు వాడాడు. క్రీస్తు శిరస్సు, విశ్వాసులు అతని దేహం. క్రీస్తు భక్తులు కలసి ఏక దేవాలయమౌతారు. ఆ మందిరానికి క్రీస్తు మూలరాయి, ప్రజలు శిలలు. క్రీస్తు భర్త, భక్తులు అతని వధువు.

ఈ వుపమానాలన్నీ ఐక్యతను సూచించేవే. ఈ జాబు క్రైస్తవ సంఘాన్ని కూడ విపులంగా వర్ణిస్తుంది. రచయిత లోతయిన దైవశాస్త్రాంశాలు చెప్పాడు.

## 2. తండ్రికి స్తుతి 1,3-14

తండ్రి క్రీస్తుద్వారా మనలను రక్షించాడు కనుక అతన్ని స్తుతించాలి అని చెప్తూ రచయిత ఈ గీతాన్ని ఉదాహరించాడు. బహుశా ఈ గీతం అతడు వ్రాసిందికాదు. ఆనాడు దైవార్చనలో వాడుకలో ఉన్న దాన్ని ఉన్నట్లుగా ఉదాహరించాడు. ఈ గీతం స్తుతి రూపంలో వుంటుంది. దేవుడు క్రీస్తు ద్వారా మనలను రక్షించాడు కనుక అతనికి స్తుతి కలగాలి అని చెప్తుంది. దీనిలోని ముఖ్య భావాలు ఇవి.

1. తండ్రికి స్తుతి కలగాలి - 3
2. లోకాన్ని కలిగించకముందే తండ్రి క్రీస్తుద్వారా మనలను ఎన్నుకొన్నాడు - 4
3. క్రీస్తుద్వారా మనం తండ్రికి పుత్రుల మౌతాం - 5
4. క్రీస్తు మరణం ద్వారా మనకు రక్షణం కలిగింది - 7
5. మనం క్రీస్తుతో ఐక్యం కావాలన్నదే దేవుని రక్షణ ప్రణాళిక - 9
6. సమస్త సృష్టి క్రీస్తుతో ఐక్యంగావాలి. అతడు శిరస్సు, మనం అవయవాలం.
7. దేవుని రక్షణ ప్రణాళికను బట్టి మనం అతన్ని స్తుతించాలి - 12
8. ఆత్మద్వారా మనం మన వారసత్వమైన మోక్షాన్ని పొందుతాం-13-15

   తండ్రి క్రీస్తుద్వారా మనలను తన ప్రజగా ఎన్నుకోవడం ఇక్కడ ముఖ్యాంశం. తండ్రి రక్షణ ప్రణాళిక చేసాడు. క్రీస్తుదాన్ని నిర్వహించాడు.

## 3. యూదులూ అన్యులూ 2,11-22

ఈ భాగంలో క్రీస్తు యూదులను అన్యజాతి ప్రజలనూ ఐక్యం చేయడాన్ని గూర్చి చెప్తున్నాడు. ఇక్కడ మూడంశాలు వున్నాయి.

### 1. అన్యులు కూడ నిబంధనలో చేరారు 2,11-13

అన్యజాతి వాళ్లకు సున్నతి లేదు. కనుక వాళ్లకు సీనాయి

నిబంధనంలో పాలు లేదు. వాళ్లకు దేవుడు లేడు నిరీక్షణం లేదు. కాని ఇప్పుడు క్రీస్తుని విశ్వసించి దూరస్థులు సమీపస్థులయ్యారు. గ్రీకు ప్రజలు కూడా రక్షణాన్ని పొందారు.

**2. క్రీస్తుద్వారా యూదులూ అన్యులూ ఐక్యమయ్యారు 12,14-18**

క్రీస్తు యూదులనూ అన్యులనూ ఏకంజేసే సమాధాన కర్త అయ్యాడు. యెరూషలేం దేవాలయంలో అడ్డుగోడవుండేది. ఈగోడ దాటి అన్యులు దేవాలయం లోపలికి పోకూడదు. ఈ గోడ అన్యులను వేరు పరచింది. క్రీస్తు తన శరీరంద్వారా, అనగా తాను సిలువమీద చనిపోవడం ద్వారా, ఈయడ్డు గోడను తొలగించాడు. ఈయడ్డు గోడ ధర్మశాస్త్రమే. క్రీస్తు ఈ ధర్మశాస్త్రాన్ని రద్దుచేసాడు. దానితో యూదులకీ అన్యజాతి వారికీ వున్న వైరం తొలగిపోయింది. పూర్వం యూదులు అన్యజాతివారిని అసహ్యించుకొని వారికి దూరంగా వుండే వాళ్లు. ఇప్పుడు ఆ వైరంపోయి శాంతి నెలకొంది. క్రీస్తు మరణంతో ఉభయజాతులు దేవునితోను, తమలోతామూనూ ఐక్యమయ్యారు. క్రీస్తు తన బోధలద్వారా మరణంద్వారా అందరికీ సమాధానాన్ని చేకూర్చిపెట్టే సువార్తను బోధించాడు. అతడు శాంతి స్థాపకుడు. సిలువమరణంద్వారా శాంతి చేసినవాడు. ఇప్పుడు ఉభయజాతులు ఆ క్రీస్తుద్వారా ఆత్మయందు తండ్రిని చేరగల్గుతున్నారు.

**3. తిరుసభ దైవారాధన జరిగే దేవాలయం 2,19-22**

ఒక పవిత్ర దేవాలయం వుంది. దానికి అపోస్తలులూ ప్రవక్తలూ పునాది. క్రీస్తు మూలరాయి. అన్యజాతి ప్రజలు ఈ మందిర నిర్మాణంలో శిలలు. అందరూ కలసి ఈ పవిత్ర దేవాలయం ఔతారు. దానిలో దేవుడు ఆత్మద్వారా వసిస్తాడు. ఈ దేవాలయం తిరుసభే. ఈ తిరుసభలో తండ్రికి ఆరాధన జరుగుతుంది.

యూదుల్లో ఎస్సీనులు అనే ఒక వర్గం ప్రజలు వుండేవాళ్లు. వీళ్లు తామే దేవుని మందిరం అనుకొన్నారు. మన రచయిత యూదులతోను అన్యులతోను కూడిన తిరుసభను దేవుని

మందిరంగా భావించాడు. యోహాను సువిశేషంలో క్రీస్తే దేవాలయం. ఈ జాబులో క్రీస్తుతో కూడిన భక్త సమాజం దేవాలయం.

ఇంకా ఈ సంఘం దేవుని కుటుంబం. గ్రీకు రోమను ప్రజలకు కుటుంబం ఆయువుపట్టు. ఈ కుటుంబంలో తల్లిదండ్రులూ పిల్లలు బానిసలూ కలసిజీవించేవాళ్లు. ఈ పిల్లలు తల్లిదండ్రుల ఆస్తికి వారసులు అయ్యేవాళ్లు. ఈలాగే క్రైస్తవ సంఘం దేవుని కుటుంబం. క్రైస్తవులు క్రీస్తుద్వారా దేవుని బిడ్డలు. వీళ్లు తండ్రి ఆస్తియైన మోక్షానికి వారసులు ఔతారు.

## 4. విశ్వాసులు క్రీస్తుప్రేమను గ్రహించాలి 3,14-20

ఈ భాగం ప్రార్థనా రూపంలో వుంది. రచయిత విశ్వాసుల కొరకు ప్రార్థన చేస్తున్నాడు. మొదట అందరు తండ్రులకు తండ్రియైన దేవునికి నమస్కారం చేస్తున్నాడు. అన్ని కుటుంబాలను కలగించింది తండ్రే. కనుక అతడు అందరికీ తండ్రి. కనుక ఆ తండ్రికి స్తుతి కలగాలి.

తర్వాత ప్రజలు క్రీస్తుపట్ల విశ్వాసంలో స్థిరత్వాన్ని పొందాలని వేడుకొంటున్నాడు. విశ్వాసంద్వారా క్రీస్తు వారి హృదయాల్లో వసించాలి. కుండనీటితో నిండి వున్నట్లుగా వారి మనస్సు క్రీస్తుతో నిండివుండాలి. క్రీస్తుకి వారిపట్ల వున్న ప్రేమ ఎంతగొప్పదో ఎంత విశాలమైనదో వాళ్లు అర్థంచేసి కోవాలి. ఆ దివ్యప్రేమ యెరూషలేము దేవాలయమంత, యెరూషలేము నగరమంత విశాలమైందని గ్రహించాలి. వాళ్లు దేవుని పూర్ణత్వంతో సంపూర్ణంగా నింపబడాలి. అనగా వాళ్లు పరిపూర్ణమైన దేవుని దైవత్వంలో పాలు పొందాలి.

## 5. భార్యాభర్తలు 5,21-33

ఈ పఠనం పెండ్లి పూజలో వస్తుంది. ఇది నూత్నవేదంలో ప్రధానమైన పెండ్లిపఠనం. కనుక పవిత్రమైంది. పౌలు మొట్టమొదటనే భార్యాభర్తలిద్దరూ ఒకరికొకరు విధేయులు కావాలని చెప్పాడు. ఇక్కడ విధేయత అంటే ఒకరికొకరు సేవచేసికోవడం.

21-24లో భార్యలను గూర్చి చెప్తున్నాడు. తిరుసభ క్రీస్తు దేహం. ఈ దేహానికి క్రీస్తు శిరస్సు. క్రీస్తు అధికారి. తిరుసభ క్రీస్తుకి లొంగివుంటుంది. వివాహంలో వరుడు క్రీస్తుకీ, వధువు తిరుసభకూ పోలికగావుంటారు. కనుక భార్య భర్తకు లొంగివుండాలి. కుటుంబంలో ఏక నాయకత్వం వుండాలి.

25-33లో భర్తలను గూర్చి చెప్తున్నాడు. పూర్వవేదంలో యావే వరుడు, యిస్రాయేలు అతని వధువు అనే భావం వుంది. నూత్నవేదంలో క్రీస్తు వరుడు, తిరుసభ అతని వధువు. క్రీస్తు తన వధువు కొరకు ప్రాణాలు అర్పించాడు. ఆ వధువుని వాక్య బోధతోను జ్ఞానస్నానంతోను శుద్ధిచేసాడు. ఆమెను తన యెదుట నిల్పుకొని ఆమెను చూచి ఆనందించాడు. యూదుల, గ్రీకుల వివాహాల్లో వధువుని స్నానం చేయించి అలంకరించి వరునిముందు నిల్పేవాళ్లు. క్రీస్తు తిరుసభ కొరకు ప్రాణాలు అర్పించి సిలువ మీద చనిపోయాడు. తిరుసభ క్రీస్తు దేహం. భార్య భర్త దేహం. క్రీస్తు తిరుసభను ప్రేమించనట్లే భర్త భార్యను ప్రేమించాలి.

పూర్వవేదంలో ఆదాము ఏవ ఏకవ్యక్తి అన్నట్లుగా ఐక్యమయ్యారు -2,24. ఈయైక్యత నూత్నవేదంలో క్రీస్తు తిరుసభల ఐక్యతను సూచిస్తుంది. ఈ యైక్యత వివాహంలో మళ్లా భార్యాభర్తల మీద సోకుతుంది.

భర్త భార్యమీద అధికారం చలాయించకూడదు. ప్రేమ చూపాలి. ఇద్దరు ఏకవ్యక్తి అన్నట్లుగా కలిసమెలసి జీవించాలి. ఇద్దరికీ క్రీస్తు తిరుసభ ఆదర్శంకావాలి.

గ్రీకు సంస్కృతిలో ప్రేమ రెండు రకాలు. భార్య శరీర సౌందర్యాన్ని చూచి ఆమెను ప్రేమించడాన్ని "ఈరోస్" అన్నారు. ఇక్కడ రచయిత ఉద్దేశించింది ఈ ప్రేమకాదు. ప్రేమించిన వ్యక్తి కొరకు ప్రాణాలు అర్పించడాన్ని "అగపె" అన్నారు. ఈ ప్రేమలో స్వార్థత్యాగం వుంటుంది. క్రీస్తు తిరుసభ పట్ల ఈలాంటి ప్రేమ చూపాడు. రచయిత భావం ప్రకారం, భర్త భార్యపట్ల చూపవలసింది

ఈ ప్రేమ. వివాహ జీవితంలో ఈ ప్రేమవుంటే భర్త నియంతాకాడు, భార్య బానిసాకాదు.

కడన 6,1-4లో తల్లిదండ్రులు పిల్లల సంబంధాన్ని చెప్పాడు పిల్లలు తల్లిదండ్రులకు విధేయులై యుండాలి. వారిని గౌరవించాలి. తల్లి దండ్రులు పిల్లల శక్తిసామర్థ్యాలను అణచివేయకూడదు. వారి కోపాన్ని రెచ్చగొట్టకూడదు. వారికి క్రమశిక్షణ, మతవిద్య నేర్పాలి. మామూలుగా పిల్లలకు తల్లిదండ్రుల కంటె ఎక్కువభక్తి రాదు.

## 6. తిరుసభ

ఈ జాబు తిరుసభను విపులంగా వర్ణిస్తుంది.

1. క్రీస్తు తన మరణం ద్వారా తిరుసభను స్థాపించాడు.
2. ఆ సభలో యూదులూ అన్యజాతివాళ్లూ కూడ ఐక్యమౌతారు.

- క్రీస్తు ఈ వుభయజాతులకు మధ్యగల అడ్డుగోడను పడగొట్టి దూరస్థులను సమీపస్థులను చేసాడు -213-14. ఇరువురి మధ్య వైరాన్ని తొలగించాడు
- ఉభయులూ ఆత్మద్వారా తండ్రిని చేరతారు -2,18
- అందరూ కలసి ఒకే దేవాలయం ఔతారు -2,22
- అందరూ కలసి సంపూర్ణక్రీస్తుగా ఎదుగుతారు.

3. క్రీస్తు తిరుసభలో వివిధ సేవలు నెలకొల్పాడు. అపోస్తలులు, ప్రవక్తలు, సువార్తికులు ఈ సేవలు చేస్తారు 4, 11. ఈ సేవల ద్వారా తిరుసభ పెరుగుతుంది. క్రీస్తు పరిపూర్ణుడు ఔతాడు-4,13.
4. తిరుసభ క్రీస్తు శరీరం, అతడు శిరస్సు. శరీరం వృద్ధిచెందే కొద్దీ క్రీస్తుకి పరిపూర్ణత వస్తుంది - 4,15-16.
5. తిరుసభ క్రీస్తు వధువు. అతడు ఆమెను వాక్యబోధ జ్ఞానస్నానం ద్వారా కడిగి శుద్ధిచేసాడు - 5,26-27.
6. వివాహ జీవితంలో భార్యాభర్తలు ఈ తిరుసభకీ క్రీస్తుకీ పోలికగా వుంటారు.

# 5. కొలొస్సీయుల జాబు

## 1. పరిచయం

**రచయిత:** ఈ జాబు పౌలు స్వయంగా వ్రాసింది కాదు. అతని అనుయాయులు ఎవరో పౌలు పేరుమీదిగా వ్రాసారు. పౌలు భావాలకూ దీనిలోని భావాలకూ కొన్ని తేడాలు వున్నాయి. ఈ జాబు కొలొస్సే సమాజానికి వ్రాయబడినట్లు కన్పిస్తున్నా యథార్థంగా మరేదో సమాజానికి వ్రాసారు.

**కాలం :** 80 ప్రాంతంలో ఎఫెసు నగరం నుండి ఈ లేఖను వ్రాసినట్లుగా కన్పిస్తుంది. లేఖలో మాత్రం పౌలు చెరనుండి దీన్ని వ్రాసినట్లుగా వుంది. అది నిజంకాదు.

**సందర్భం:** కొలొస్సే సమాజాన్ని నూత్నవ్యక్తులు కొందరు అపమార్గం పట్టించారు. వీళ్ళ క్రీస్తుతో పాటు దేవదూతలను కూడ ఆరాధించాలనీ, రక్షణం వీరినుండి కూడ వస్తుందనీ చెప్పారు. సున్నతి మొదలైన యూదుల ఆచారాలను పాటించాలని వాదించారు. ఇంకా యూదుల పండుగలు భోజన నియమాలు మొదలైన వాటిని కూడ అనుసరించాలని బోధించారు. వీరి బోధలవల్ల క్రీస్తు ప్రాముఖ్యం దైవత్వం తగ్గిపోయేలా వుంది. ఈ పరిస్థితుల్లో ఆ కాలపు క్రైస్తవుల విశ్వాసాన్ని బలపరచి పదిలం చేయడానికి రచయిత ఈ జాబు వ్రాసాడు. ఇది లోతైన దైవశాస్త్ర భావాలతో నిండివుంటుంది. పౌలు భావాలనే ఎత్తుకొన్నా వాటిని మించిపోయి నూత్నాంశాలను కూడ చేరుస్తుంది. ఎఫెసీయుల జాబు దైవసంఘానికి ప్రాముఖ్యం ఇచ్చినట్లే యిది క్రీస్తుకి ప్రాముఖ్యం ఇస్తుంది. ప్రస్తుతం ఈ లేఖనుండి మూడంశాలు పరిశీలిద్దాం.

## 2. క్రీస్తు గీతం 1,15-20

ఈ గీతం ప్రసిద్ధమైంది. ఇది రచయిత స్వయంగా వ్రాసింది కాదు. అతడు ఆనాడు దైవార్చనలో వాడుకలో వున్న ఓ పాటను తన భావాలను విశదీకరించడానికి అనువుగా వుంటుందని వాడుకొన్నాడు. దీనిలో మూడు ప్రధాన భావాలు వున్నాయి. సృష్టిలో క్రీస్తుపాత్ర, తిరుసభతో అతనికున్న సంబంధం, అతని మరణం

ద్వారా నరులకు రక్షణం కలగడం. ఇక, ఈ మూడింటినీ పరిశీలిద్దాం.

**1. సృష్టిలో క్రీస్తు పాత్ర 1,15-17**

15. క్రీస్తు మనకు దేవుణ్ణి ప్రత్యక్షం చేసేవాడు. సృష్టిలో అతడే మొదటివాడు. పూర్వవేదం ప్రభువు మొదటజ్ఞానాన్ని కలిగించి దాని ద్వారా ఇతర వస్తువులను కలిగించాడని చెప్తుంది - సామె 8,22. ఇక్కడ ఈ జ్ఞాన లక్షణాలను క్రీస్తుకి అన్వయించారు.

16. దేవుడు అన్ని వస్తువులను అందరు దేవదూతలను ఆక్రీస్తు ద్వారానే సృజించాడు. అన్నీ అతని ద్వారా అతని కొరకే వున్నాయి. సృష్టి అంతా క్రీస్తుకొరకే.

17. అతడు అన్నిటికంటె మొదటివాడు. సృష్టికి ముందే వున్నవాడు. అన్నివస్తువులు అతని మీదనే ఆధారపడి నిలుస్తాయి. ఫలితాంశం ఏమిటంటే, సృష్టి అంతా క్రీస్తుద్వారానే జరిగింది. క్రీస్తు మీదనే ఆధారపడి నిలుస్తుంది. దేవదూతలు క్రీస్తుకంటె తక్కువవాళ్లు కనుక వారిని ఆరాధించ కూడదు.

**2. తిరుసభతో క్రీస్తుకి సంబంధం 1,18-19**

18. విశ్వ శ్రీసభ అనే శరీరానికి క్రీస్తు శిరస్సు లేక నాయకుడు. క్రీస్తు విశ్వాసులు కలసి ఏకవ్యక్తి ఔతారని భావం. అన్ని వస్తువుల్లోను అతడే మొదటివాడు. చనిపోయిన వారిలో నుండి మొదట ఉత్థానమైంది అతడే. కనుక అన్నిటికంటె అతనికే ఎక్కువ ప్రాముఖ్యం వుంటుంది.

19. దేవుని సంపూర్ణత్వం, సర్వశక్తి అతనిలో నెలకొనివుంది.

**3. క్రీస్తు మరణం ద్వారా రక్షణం 1,20**

20. దేవుడు క్రీస్తుద్వారా సృష్టిని తనతో రాజీపరచుకొన్నాడు. సిలువపై అతడు చిందించిన నెత్తురు ద్వారా ఈ రాజీ జరిగింది. లోకమంతా క్రీస్తు మరణం ద్వారానే పాపపరిహారం పొందింది. అందరు నరులకు అతడే మధ్యవర్తి.

ఇది క్రీస్తు గొప్పతనాన్ని చక్కగా వర్ణించే స్తుతిగీతం. యోహాను సువిశేషంలో మొదటి అధ్యాయంలోని మొదటి భాగం లాంటిది. మన ప్రార్థనకు బాగా ఉపయోగపడుతుంది.

## 3. హృదయం పరలోక వస్తువులమీద 3,1-4

జ్ఞానస్నానం ద్వారా విశ్వాసులు క్రీస్తుతో చనిపోయి అతనితో ఉత్థానమయ్యారు. మోక్షంలో క్రీస్తు తండ్రి సమక్షంలో ఆసీనుడై యున్నాడు. తండ్రి అతన్ని విశ్వానికి అంతటికీ రాజుగా నియమించాడు. కనుక మన మనసు కోరికలు అన్నీ ఆ పరలోకం మీద నిలవాలి. ఈ లోక వస్తువల మీద నిలవకూడదు. మామూలుగా మనం ఈ లోకానికీ ఇక్కడి వస్తువులకీ అంటిపెట్టు కొని వుంటాం. కాని మనం ఉత్థాన ప్రజలం. మన ఉత్థానం ఇది వరకే, మన జ్ఞానస్నానంలోనే జరిగింది. ఉత్థాన ప్రజల్గాగ మన దృష్టి పరలోకంమీద, అక్కడి వస్తువులమీద నిలవాలి.

మన ఉత్థాన తేజస్సు ప్రస్తుతం క్రీస్తులో దాగివుంది. వెలుపలికి కన్పించదు. క్రీస్తు రెండవసారి వచ్చినపుడు మన ఉత్థాన తేజస్సు బట్టబయలుగా కన్పిస్తుంది.

మన దృష్టి ఉత్థాన క్రీస్తుమీద నిలవాలి. సంపదలు ఉన్న చోటనే హృదయం వుంటుంది కదా - మత్త 6,21. లోకాశలను జయించి ఉత్థాన క్రీస్తుపై దృష్టినిల్పి దివ్యమైన జీవితం గడపాలి. రెండవ రాకడలో మనం కూడ మహిమను పొందుతాం.

ఈ వేదభాగం క్రీస్తు ఉత్థానపూజలో మొదటి పఠనంగా వస్తుంది. బాగా ప్రేరణం పుట్టించేది. కనుక పలుసార్లు మననం చేసికోదగ్గది.

## 4. భక్తి మార్గం 3,16-17

ఉత్థాన ప్రజల జీవితం ఏలా వుండాలి? రచయిత విశ్వాసుల భక్తిమార్గానికి ఐదు సూత్రాలు చెప్పాడు. అవి యివి.

1. భక్తుల హృదయాలు క్రీస్తుని గూర్చిన బైబులు వాక్కుతో నిండివుండాలి. ఈ వాక్కు ద్వారా క్రీస్తు వాళ్ల హృదయాల్లో వసిస్తాడు. ఈ వాక్కు మనకు బైబులుపఠనం ద్వారా బోధకుల బోధద్వారా కూడ లభిస్తుంది. దైవవాక్కు హృదయాలను కదిలించి సత్కార్యాలకు ప్రేరేపిస్తుంది.

2. విశ్వాసులు ఒకరికొకరు జ్ఞానాన్ని బోధిస్తుండాలి. త్రోవదప్పినపుడు ఒకరినొకరు హెచ్చరించి మందలిస్తూవుండాలి.

తప్పుచేసిన వాళ్లు మందలింపును స్వీకరించాలి. ఈ ప్రక్రియవల్ల సమాజంలో విశ్వాసం బలపడుతుంది. భక్తి పెరుగుతుంది.

3. ఆరాధనలో, బృందప్రార్థనలో కీర్తనలు, పాటలు స్తుతిగీతాలు పాడాలి. దీనివల్ల ఆరాధనలో భక్తిపెరుగుతుంది. క్రైస్తవారాధనలో తొలిశతాబ్దాల నుండి కీర్తనలు, పాటలు పాడేవాళ్లు. దీనివల్ల హృదయం ద్రవించి దేవుడు అనుభవానికి వచ్చేవాడు. కనుక భక్తి సంగీతాన్ని బాగా ప్రోత్సహించాలి.

4. దేవునికి కృతజ్ఞతలు తెలపాలి. ఈ కృతజ్ఞత మన క్రైస్తవ విశ్వాసానికి కావచ్చు. దివ్యసత్ప్రసాద బలికి కావచ్చు. వరప్రసాదానికి కావచ్చు. క్రైస్తవుడు ప్రధానంగా దేవునికి వందనాలు చెప్పుకోవాలి.

5. మన పనులన్నీ క్రీస్తు పేరుమీదిగా జరగాలి. మన పలుకులన్నిటిని అతని పేరు మీదిగా పలకాలి. అనగా మన మాటలు క్రియలు అతనికి తగినట్లుగా వుండాలి. అతనికి సమర్పించడానికి యోగ్యంగా వుండాలి. క్రీస్తు మనకు ప్రధాన మధ్యవర్తి. కనుక మన క్రియలన్నీ అతనికి అర్పితం కావాలి.

ఈ పంచసూత్ర భక్తిని పాటిస్తే మన జీవితం పవిత్రమౌతుంది.

కడన పౌలు వాక్యాన్ని ఒకదాన్ని మననం చేసికొందాం. "క్రీస్తు తన శరీరమైన తిరుసభ కొరకు పడిన శ్రమలలో కొదవగా వున్నవానిని నాశ్రమల ద్వారా పరిపూర్తి చేయుచున్నాను - 1,24. క్రీస్తు తిరుసభ కొరకు శ్రమలు అనుభవించాడు. ఈ శ్రమలు అతని భక్తుల జీవితాల్లో గూడ కొనసాగుతాయి. అసలు క్రీస్తే తన అనుచరుల జీవితంలో శ్రమలు అనుభవిస్తూపోతాడు. ఈయనుచరుల బాధలు క్రీస్తు బాధలతో కలసి తిరుసభకు మేలు చేస్తాయి. కనుక పౌలు నానా బాధలు అనుభవించి ఆనాటి తిరుసభను బలపరచాడు. నేడు మనం మనబాధల ద్వారా ఈనాటి తిరుసభను బలపరచాలి.

క్రీస్తుశ్రమలు రెండు రకాలు. మొదటిది, ఆత్మార్పణ శ్రమలు. అనగా అతని సిలువ మరణానికి చెందిన శ్రమలు. ఇక్కడ ఏ కొరతా లేదు. సిలువబలి పరిపూర్ణమైందే. రెండవది, అతడు తన సేవకుల్లో పడేశ్రమలు. అనగా క్రీస్తుభక్తులు క్రీస్తు పేరుమీదిగా అనుభవించే

శ్రమలు. ఇవి యెప్పుడూ అపరిపూర్ణంగా కొదవగా వుంటాయి. పౌలు పూర్తి చేసింది, ఇప్పుడు మనం పూర్తి చేయవలసింది కూడ, ఇవే.

# 6. రోమా పౌరులు జాబు

## 1. పరిచయం

**స్థలకాలాలు :**

పౌలు 57-58 ప్రాంతంలో, మూడవ ప్రేషిత ప్రయాణంలో కొరింతు నుండి ఈ జాబు వ్రాసాడు. దీన్ని ఫీబె అనే పరిచారకురాలి ద్వారా రోముకి పంపాడు. రోములో గ్రీకు, యూదక్రైస్తవులు వున్నారు. ఈ సంఘాన్ని పౌలు స్థాపించలేదు.

**సందర్భం :**

పౌలు తూర్పుతీరాన వేదబోధ ముగించాడు. పశ్చిమాన గల స్పెయినుకి వెళ్ళి వేద బోధ చేయాలనుకొన్నాడు. రోముమీదిగా స్పెయినుకి వెళ్ళగోరాడు. కనుక రోమనులతో పరిచయం కలిగించుకోవడానికి ఈ జాబు వ్రాసాడు. ఇంకా, అతడు గ్రీకు క్రైస్తవులనుండి ప్రోగుజేసిన చందాను యూదక్రైస్తవులకు సమర్పించి ఆమీదట రోముకి వెళ్ళాలను కొన్నాడు.కనుక రోముకి జాబు వ్రాసాడు. పైగా, తనకు విరోధులైన యూద క్రైస్తవులకు తన భావాలను వివరించి చెప్పాలన్న ఉద్దేశంతో గూడ దీన్ని వ్రాసాడు.

**ప్రాముఖ్యం :**

ఇది పాలు జాబుల్లో కెల్ల శ్రేష్ఠమైంది. దైవశాస్త్రరీత్యా చాల లోతైంది. చాలమంది వేదపండితులు ప్రాచీనులూ ఆధునికులూ కూడ దీనిమీద వ్యాఖ్యలు వ్రాసారు. 16వ శతాబ్దంలో ప్రొటస్టెంటు నాయకుల వాదానికి ఈ లేఖ ఆధారమైంది. నూత్న వేదంలో నాల్గు సువిశేషాలూ అపోస్తుల చర్యలూ తర్వాత ఇదే ముఖ్యగ్రంథం. గలతీయుల జాబు దీనిలోను కూడ ధర్మశాస్త్రం ఇక చెల్లదు, క్రీస్తుని విశ్వసించడం ద్వారా మాత్రమే రక్షణం కలుగుతుంది అనే భావం వస్తుంది. గలతీయుల జాబు విరోధులతో వాదించినట్లుగా వుంటుంది. ఉద్రేకంతో నిండివుంటుంది. ఈ జాబు పౌలు విరోధులకు తన అభిప్రాయాలను ప్రశాంతంగా వివరించినట్లుగా వుంటుంది.

## 2. ప్రారంభవాక్యాలు 1,1-7

ఈ జాబు ప్రారంభం గంభీరంగా వుంటుంది. కొన్ని వివరాలు చూద్దాం.

1. పౌలుకి మూడు బిరుదాలు వున్నాయి. మొదటిది, అతడు యేసు క్రీస్తు సేవకుడు. సువిశేషబోధద్వారా క్రీస్తుకి సేవలు చేసే దాసుడయ్యాడు. అతడు అబ్రాహాము, మోషే, బాధామయ సేవకుడు మొదలైన వారి కోవలో వచ్చినవాడు. రెండవది, డమస్కుత్రోవలో క్రీస్తు అతన్ని అపోస్తులుణ్ణిగా నియమించాడు. ఈ బిరుదాన్ని అతని విరోధులు నిరాకరించారు. కనుక పౌలు తన్నుతాను సమర్థించుకొన్నాడు. మూడవది, అతడు క్రీస్తు సువార్త నిమిత్తం ప్రత్యేకింపబడినవాడు. ప్రభువు యిర్మీయాను లాగ మాతృగర్భంనుండే అతన్ని ఎన్నుకొన్నాడు - గల 1,15.

2. క్రీస్తుని గూర్చిన ఈ రక్షణ సందేశాన్ని ప్రవక్తలు ముందుగానే పూర్వవేదంలో తెలియజేసారు. వారి ప్రవచనాలు మెస్సీయాను గూర్చి తెలియజేస్తాయి.

3-4. శారీరక రీత్యా క్రీస్తు దావీదు కుమారుడు. కాని పరిశుద్ధపరచే ఆత్మశక్తిరీత్యా, ఉత్థానంద్వారా, దేవుని కుమారుడు. అనగా అతడు దేవుని శక్తి కలవాడు.

5. దేవుడు డమస్కు త్రోవలో పౌలుకి అనుగ్రహమూ అపోస్తులత్వము ఇచ్చాడు. అన్ని జాతుల ప్రజలు క్రీస్తుని విశ్వసించి అతనికి విధేయులయ్యేలాగ చేయడం పౌలు పని. విధేయులు కావడం అంటే క్రీస్తుని రక్షకుణ్ణిగా అంగీకరించడం. ఇది వేదబోధ వినడంతో ప్రారంభమౌతుంది. క్రీస్తుని విశ్వసించి రక్షకుణ్ణిగా అంగీకరించడంతో ముగుస్తుంది.

6. రోములోని గ్రీకు యూదప్రజలు కూడ క్రీస్తుని విశ్వసించి అతనినుండి రక్షణం పొందేవాళ్లు. ఈ సంఘాన్ని పౌలు స్థాపించలేదు.

7. పూర్వవేదంలోని యూదులు దేవునికి ప్రియులు, పరిశుద్ధులు. రోముక్రైస్తవులు కూడ అలాంటి వాళ్లే. క్రీస్తుద్వారానే వారికి ఈ భాగ్యం కలిగింది. వారికి దేవుని అనుగ్రహం లభిస్తుంది. క్రీస్తు సిలువ మరణం ద్వారా పాపపరిహారం లభిస్తుంది. ఇదే సమాధానం.

## 3. క్రీస్తుని విశ్వసించడం ద్వారానే రక్షణం 3,21-31

ఈ భాగం రోమీయుల జాబులోని ప్రధాన సందేశాన్ని సంగ్రహంగా వివరిస్తుంది. ఇక్కడ మూడంశాలు వున్నాయి. వాటిని సంగ్రహంగా పరిశీలిద్దాం.

### 1. తండ్రి నీతి 3,21-24

న్యాయస్థానంలో న్యాయాధిపతి ఒకణ్ణి నిర్దోషిగా ప్రకటిస్తాడు. ఆలాగే దేవుడు నరుణ్ణి నిర్దోషిగా ప్రకటించాడు. ఈ నిర్దోషత్వమే, అనగా పాపరాహిత్యమే నీతి. ఇదే రక్షణం. ఈ నీతి లేక రక్షణానికి హీబ్రూలో "సెడెకా" అనీ గ్రీకులో "దెకాయొసునీ" అని పేర్లు. తండ్రినీతి నరుని నీతికూడ వున్నాయి. తండ్రి నీతి ఏమిటి? క్రీస్తుద్వారా, అతని మరణోత్థానాలద్వారా, నరులను రక్షించడం. నరుని నీతియేమిటి? క్రీస్తుని విశ్వసించి అతని నుండి రక్షణాన్ని పొందడం. లోకాంతంలో నరులు ప్రకాశవంతమైన దేవుని సాన్నిధ్యంలోకి రావాలి. కాని పాపం ద్వారా వాళ్లు ఆ సాన్నిధ్యాన్ని కోల్పోయారు -23. ఇప్పుడు మళ్లా క్రీస్తు మరణ ఫలితం ద్వారా ఆ సాన్నిధ్యాన్ని పొందుతారు.

### 2. క్రీస్తు సిలువమరణం ద్వారా 3,25-26

పూర్వవేదంలో దేవాలయంలోని కరుణాఫలకం మీద ఎడ్ల నెత్తురు చల్లి నరుల పాపాలకు పరిహారం చేసారు - లేవీ 16,14-16. తండ్రి క్రీస్తుని ఈ కరుణాఫలకంగా చేసాడు - 25. సిలువమీద వ్రేలాడే క్రీస్తు కరుణాఫలకంలా వున్నాడని భావం. అనగా అతడు మన పాపాలకు ప్రాయశ్చిత్తం చేసేవాడు అయ్యాడు. అతని సిలువమరణం ద్వారానే గదా మనకు పాపపరిహారం జరిగింది. నీతి లేక రక్షణాన్ని మనంతట మనం పొందలేం. అది తండ్రినుండి క్రీస్తు మరణం ద్వారా రావలసిందే.

### 3. క్రీస్తునందలి విశ్వాసంద్వారా రక్షణం 3,27-31

యూదులు ధర్మశాస్త్రం ఆదేశించే పుణ్యక్రియలద్వారా రక్షణం కలుగుతుంది అనుకొన్నారు. ధర్మశాస్త్రాన్ని పాటించేది తామే కనుక రక్షణం తమకు మాత్రమే లభిస్తుంది అనుకొన్నారు. కాని ఇది పొరపాటు. రక్షణం క్రీస్తు నుండి రావలసిందే. రక్షణం ధర్మశాస్త్రాన్ని అనుసరించి చేసిన పుణ్యక్రియలనుబట్టి రాదు. క్రీస్తుపట్ల విశ్వాసం

ద్వారా వస్తుంది. ఈ విశ్వాసం ద్వారా క్రీస్తుని నమ్మి అతనిమీద ఆధారపడతాం. యూదులూ అన్యజాతివారూ కూడ క్రీస్తుని విశ్వసించి, అతనిలోనికి జ్ఞానస్నానం పొంది రక్షణను సాధించవలసిందే.

ఫలితాంశం ఏమిటంటే, నీతిని లేక రక్షణను ఇచ్చేది తండ్రి. అది క్రీస్తు మరణోత్థానాల ద్వారా వస్తుంది. నరులు వాళ్లతరపున వాళ్లు క్రీస్తుని విశ్వసించి అతనిలోనికి జ్ఞానస్నానం పొందాలి. క్రీస్తు మరణం తర్వాత ధర్మశాస్త్రం మనలను రక్షించదు. అది మనలను రక్షిస్తే క్రీస్తు సిలువమీద చనిపోవడమెందుకు?

## 4. ఇద్దరు ఆదాములు 5,12-21

ఈ భాగంలో పౌలు ఇద్దరు ఆదాములను ఒకరితో ఒకరిని పోలుస్తున్నాడు. మొదటి ఆదాము పాపమూ మృత్యువూ తెచ్చిపెట్టాడు. ఈ మృత్యువు భౌతికమైన చావూ, ఆధ్యాత్మికమైన చావూకూడ. రెండవ ఆదాము వరప్రసాదమూ జీవమూ తెచ్చాడు. ఈ యిద్దరూ సామూహిక వ్యక్తులు. వారిలో మన మందరం ఇమిడేవున్నాం. మొదటి ఆదాము పాపపు నరజాతినీ రెండవ ఆదాము ఉద్ధరింపబడిన నరజాతినీ సూచిస్తారు.

ఆదాము చేసిన ఒక్కపాపంద్వారా చాలమందికి శిక్షపడింది. కాని క్రీస్తు చేసిన ఒక్క నీతి క్రియద్వారా, అనగా అతని సిలువమరణం ద్వారా నరులు చేసిన చాలపాపాలకు పరిహారం జరిగింది. తొలి ఆదాముకంటే రెండవ ఆదాము ఘనుడు.

పాపం, మృత్యువు క్రూరులైన నియంతల్లాగ లోకంలోకి ప్రవేశించి నరజాతిని నాశంచేసాయి. క్రీస్తు ఉద్ధారకుడుగా వచ్చి నరజాతిని మళ్లా కాపాడాడు.

ఆదాము నుండి మోషే దాక రెండు వేలయేండ్లపాటు శాపం. మోషే నుండి క్రీస్తుదాక రెండు వేలయేండ్ల పాటు ధర్మశాస్త్రం. క్రీస్తు నుండి ఇప్పటిదాక రెండువేల యేండ్లపాటు వరప్రసాద భాగ్యం. కనుక ఆ ప్రభువుకి మనం వందనాలు చెప్పుకోవాలి.

## 5. జ్ఞానస్నానం 6,3-11

జ్ఞానస్నానంలో మనం క్రీస్తుతో పాటు మరణిస్తాం. అతనితో పాటు ఉత్థానమౌతాం. ఏలా? తొలిరోజుల్లో ప్రజలను మడుగులోముంచి

జ్ఞానస్నానం ఇచ్చేవాళ్లు. క్రీస్తు దేహాన్ని సమాధిలో పాతిపెట్టారు. జ్ఞానస్నానంలో నరుణ్ణి మడుగులో ముంచుతారు. దీనిద్వారా క్రీస్తుమరణం భూస్థాపనం అతని మీద సోకుతాయి. అతడు పాపానికి చనిపోతాడు. అనగా అతనికి పాపపరిహారం జరుగుతుంది.

క్రీస్తు ఉత్థానమై సమాధినుండి వెలుపలికి వచ్చాడు. నరుడు మడుగు నుండి వెలుపలికి వస్తాడు. క్రీస్తు ఉత్థానం అతనిమీద సోకి అతనికి వరప్రసాదం లభిస్తుంది.

ఇప్పుడు మననొసటిమీద నీళ్లు పోసి జ్ఞానస్నానం ఇస్తారు. క్రీస్తు మరణోత్థానాలు సంకేత క్రియలు. అవి ఇప్పుడు కూడ జ్ఞానస్నానంలో మన మీద సోకుతాయి. ఈ సంకేతాలవల్లనే మనం క్రీస్తుతో ఐక్యమై అతని నుండి వరప్రసాదాన్ని పొందుతాం.

జ్ఞానస్నానం ద్వారా మనం క్రీస్తుతో ఐక్యమౌతాం. ఎలాగ? ఒక చెట్టుమీద ఇంకో కొమ్మని అంటుగట్టినట్లుగా. తల్లి గర్భంలోని శిశువు తల్లితో ఐక్యమైనట్లుగా. ఈ యైక్యతవల్ల మనం పరిశుద్ధులం ఔతాం. జ్ఞానస్నానం తర్వాత మనం క్రొత్త జీవితం గడపాలి. మన ప్రాత స్వభావం సిలువ వేయబడాలి. క్రైస్తవ జీవితమంతా జ్ఞానస్నానాన్ని జీవించడమే.

## 6. రెండు శక్తులు 7,15-25

మనలో రెండు శక్తులున్నాయి. మొదటిది, దేవుడు మనకిచ్చిన బుద్ధి లేక తెలివి. దీనిద్వారా మనం మంచిని చేయాలని కోరుకొంటాం. ఇది మనలోవుండే దేవుని చట్టం. రెండవది, ఆదాము నుండి మనకు సంక్రమించిన పాపశక్తి. దీనిద్వారా మనం పాపం చేయాలని కోరుకొంటాం. ఇది పాపపు చట్టం.

తరచుగా మనం మంచిని చేయాలని కోరుకొనిగూడ చెడ్డనే చేస్తున్నాం. పుణ్యజీవితం గడపాలని కోరుకొని గూడ పాపంలోపడి పోతున్నాం. ఆదాము పాపం మనలను నిరంతరం లొంగదీసికొంటుంది.

మన వ్యక్తిత్వంలో రెండు నియమాలున్నాయి. మంచిని చేయాలనే నియమం, చెడ్డను చేయాలనే నియమం. మనలో రెండాత్మలు పోరాడుతున్నాయి. మంచి ఆత్మ, దుష్టాత్మ. వెలుగు, చీకటి. ఈ పోరాటం నిరంతరం కొనసాగుతూనేవుంది. తరుచుగా మనం దుష్టాత్మకే లొంగుతున్నాం. చెడ్డనే చేస్తున్నాం. ఇది మన దౌర్భాగ్యం. ఇది మనందరి అనుభవం.

ఈలా చెడ్డను చేయడమనే దౌర్భాగ్యం నుండి మనలను రక్షించే దెవరు? మనంతట మనం ఈ చెడ్డవైపు మొగ్గడమనే బలహీనతను తప్పించుకోలేం. క్రీస్తు వరప్రసాదం మనలను ఆదుకోవాలి. అతని అనుగ్రహం మనలను కాపాడాలి.

## 7. ఆత్మశక్తి – 8

పౌలు ఎన్మిదవ అధ్యాయంలో ఆత్మనుగూర్చి చాల విషయాలు చెప్పాడు. ఇక్కడ ప్రధానంగా రెండంశాలు వున్నాయి.

### 1. క్రైస్తవ జీవితంలో ఆత్మ ప్రాధాన్యం 8,1-13

కొందరు శరీరానుసారంగా జీవిస్తారు. వీళ్ళు పాపపు నరులు, దేవునికి విరోధులు. లోకాశల్లో తగులుకొని వుంటారు. వారికి మరణం ప్రాప్తిస్తుంది. మరి కొందరు ఆత్మానుసారంగా జీవిస్తారు. వీళ్ళ ఆధ్యాత్మిక నరులు. వీళ్లకు జీవం ప్రాప్తిస్తుంది.

తండ్రి క్రీస్తుని ఆత్మద్వారా లేపాడు. క్రీస్తుకి పునర్జీవాన్ని ఇచ్చింది ఆత్మే. తండ్రి అదే ఆత్మద్వారా మృతులమైన మనలను కూడ జీవంతో లేపుతాడు.

ఉత్థాన క్రీస్తు మనకు ఆత్మను దయచేస్తాడు. ఆత్మ మన హృదయాల్లో వసిస్తూ మనలను నడిపిస్తుంటుంది. క్రైస్తవుడు ప్రధానంగా ఆత్మానుభవం కలవాడు. ఆధ్యాత్మిక జీవితంలో ఆత్మ మనకు నాయకుడు కావాలి.

### 2. దత్తపుత్రత్వం, పరలోక మహిమ 8,14-30

ఇక్కడ మూడంశాలు వున్నాయి.

### 1. దత్తపుత్రత్వం 8,14-17

ఆత్మ మనలను దేవునికి బిడ్డలనుగా చేస్తుంది. పిశాచం బిడ్డల్ని పిశాచమే నడిపిస్తుంది. దీనికి భిన్నంగా దేవుని బిడ్డలను దేవుని ఆత్మ నడిపిస్తుంది.

పూర్వవేదంలో యూదులు మేము, దేవునికి దాసులం అనుకొన్నారు. దేవుణ్ణి చూచి భయపడ్డారు. నూత్న వేదంలో మనం దేవుణ్ణి చూచి భయపడం. చనువుతో అతని దగ్గరికి వెళ్తాం. ఆత్మ మనలను దేవునికి దత్త పుత్రులను చేసి అతన్ని చనువుతో “అబ్బా” అని పిల్చేలాగ చేస్తుంది. ఈ మాట అరమాయిక్ పదం. దీనికి నాన్న

అని అర్థం. ఆత్మ అనుగ్రహంవల్లనే మనం దేవుణ్ణి చనువుతో నమ్మకంతో నాన్న అని పిలుస్తాం. పూర్వం యూదులు దేవుణ్ణి అలా పిలవలేక పోయారు.

దేవుణ్ణి నాన్న అని పిల్చే మనం అతని ఆస్తికి కూడ వారసులం ఔతాం. ఆ యాస్తి మోక్షమే. కాని మనం మొదట క్రీస్తుతో పాటు శ్రమలు అనుభవించాలి. ఆ పిమ్మట అతనితోపాటు మహిమను పొంది మోక్షాన్ని చేరుకొంటాం. ఆత్మ క్రీస్తు ద్వారా మనలను దత్తపుత్రులను చేస్తుంది.

**2. మూడు సాక్ష్యాలు 8,18-27**

క్రీస్తుతోపాటు మనం కూడ మహిమను పొందుతాము అనడానికి మూడు సాక్ష్యాలు లేక ఆధారాలు వున్నాయి. మొదటిది, సృష్టి నరుల మహిమ కొరకు ఎదురుచూస్తుంది. తాను కూడ ఆ మహిమలో పాలు పొందాలని కోరుకొంటుంది. పూర్వం ఆదాము పాపం చేసినప్పుడే దేవుడు దాన్ని శపించాడు - ఆది 3,17. కాని దానికి కొంత నిరీక్షణను (ఆశను) మిగిల్చాడు. కడన సృష్టి కూడ నరుల మహిమలో పాలు పొంది స్వాతంత్ర్యాన్ని పొందుతుంది. ఆ స్వాతంత్ర్యం కోసం అది బాధతో మూలుగుతూ వుంది. ఈలా సృష్టి మనం మహిమను పొందుతామని సాక్ష్యమిస్తుంది.

రెండవది, మనలోని నమ్మకం సాక్ష్యమిస్తుంది. - 8, 23-25. మనం మహిమను పొందుతామనే నిరీక్షణం లేక నమ్మకం మనలో వుంది. ఇది మనకు మహిమ లభిస్తుందని రుజువు చేస్తుంది.

మూడవది, ఆత్మ మనకు మహిమ లభిస్తుందని సాక్ష్యమిస్తుంది 8,26-27. మనంతట మనం ప్రార్థన చేసికోలేం. ఆత్మ బాధపడుతూ మన కొరకు ప్రార్థన చేస్తుంది. నరులు రక్షణం పొందాలి అనే దేవుని కోరిక నెరవేరాలనే ఆత్మ ప్రార్థన. తండ్రి ఆత్మ ప్రార్థనను వెంటనే గుర్తించి నరులకు రక్షణను దయచేస్తాడు. ఈలా ఆత్మకూడ మనం క్రీస్తుతోపాటు మహిమను పొందుతామని నిరూపిస్తుంది.

**3. మనం మహిమను పొందాలనే దేవుని కోరిక 8,28-30**

దేవుడు అన్నీ మనకు మంచినే జరిగించేలా చేస్తాడు. కనుకనే మనం అతన్ని ప్రేమిస్తాం. దేవుడు అనాదికాలం నుండి తన మంచి

తనాన్ని బట్టే మనలను తన ప్రజగా ఎన్నుకొన్నాడు. ఎన్నుకొని మనలను తన సేవకు పిల్చాడు. పిల్చి క్రీస్తుద్వారా మనకు నీతిని అనగా రక్షణను దయచేసాడు. దీని ఫలితంగా మనకు మహిమను దయచేసాడు. ఈ మహిమ ఉత్థానం, మోక్షభాగ్యంకూడ.

## 8. క్రైస్తవుల జీవిత విధానం 13

క్రైస్తవులు ప్రపంచంలో ఏలా జీవించాలి అనడానికి పౌలు కొన్ని సూత్రాలు చెప్పాడు. ఇక్కడ మూడంశాలు వున్నాయి.

### 1. పౌరులుగా క్రైస్తవుల బాధ్యతలు 13,1-7

పౌరులుగా క్రైస్తవులు ప్రభుత్వాధికారులకు లొంగాలి. ఎందుకు? పౌలు మూడు కారణాలు చెప్పాడు. 1. అధికారం దేవుని నుండే వస్తుంది కనుక అందరూ దానికి లొంగవలసిందే 1-2.
2. అధికారులు దుష్టుల్ని శిక్షించి సజ్జనుల్ని రక్షిస్తారు. కనుక మన అంతరాత్మ వారికి లొంగమని చెప్తుంది 3-5.
3. అధికారులు సమష్టి శ్రేయస్సు కొరకు కృషిచేస్తారు. అందరి మేలు లెక్కలోకి తీసికొంటారు. కనుక మనం వారికి పన్నులు చెల్లించాలి.

పౌలు ఈ జాబు వ్రాసేటప్పటికి రోమను ప్రభుత్వం ఇంకా క్రైస్తవులను హింసించ లేదు. తర్వాత వేద హింసలు ప్రారంభమయ్యాయి. పౌలు ఇక్కడ ప్రజలు ప్రభుత్వానికి అనుకూలంగా మెలగాలని చెప్పాడు. కాని అతడు చెప్పిన సూత్రాలు అన్ని కాలాలకూ, అన్ని ప్రభుత్వాలకు వర్తించవు.

### 2. సోదరప్రేమ ముఖ్యం 13,8-10

ధర్మశాస్త్రంలో 613 ఆజ్ఞలున్నాయి. కాని అవన్నీ సోదరప్రేమ ఆజ్ఞలో ఇమిడే వున్నాయి - లేవీ 19,18. సోదర ప్రేమను పాటిస్తే ధర్మశాస్త్రాన్నంతటినీ పాటించినట్లే. కాని ఈ సోదరప్రేమను పాటించడం ఎంతమాత్రం సులభం కాదు. దేవుని ఆత్మే మనకు ఈ యనుగ్రహాన్ని ఈయాలి. ధర్మశాస్త్రం గమ్యం క్రీస్తు. క్రీస్తు గమ్యం ప్రేమ.

### 3. అంత్యకాలం సమీపించింది 13,11-14

క్రీస్తు మరణోత్థానాలతో నూత్నయుగం ప్రారంభమైంది. అంత్యకాలం, రెండవరాకడ సమీపించింది. పౌలు తన జీవితకాలం లోనే ప్రభువు రెండవసారి వస్తాడు అనుకొన్నాడు. రేయిముగిసి పగలు

సమీపించింది. కనుక నిద్రనుండి మేల్కొనాలి. చీకటిపోయి వెల్తురు వచ్చింది. కనుక శరీరక్రియలు, పాపక్రియలు మానుకోవాలి. ఆత్మక్రియలు చేపట్టాలి. పిశాచంతో పోరాడాలి. క్రీస్తుని ధరించాలి. అతనితో ఐక్యంగావాలి. ఆయుధాలు చేపట్టాలి. మన ప్రధానాయుధం క్రీస్తే. ఈ వాక్యాలు చాల భక్తిమంతమైనవి. ఇవి పూర్వం అగస్టీను గారికి ప్రేరణం పుట్టించి పరివర్తనం కలిగించాయని వింటున్నాం.

## 9. యూదులకు కూడ రక్షణం 11,16-27.

ఒక మంచి ఒలీవు చెట్టువుంది. కాని అది సరిగా కాయలు కాయడం లేదు. కనుక దాని కొమ్మలు విరగగొట్టారు. దాని మీద అడవి ఒలీవు చెట్టు కొమ్మలు అంటు కట్టారు. ఈ మంచి ఒలీవు యూదులు. కాని వీళ్లు పౌలు బోధించే క్రీస్తుని అంగీకరించడంలేదు. దాని మీద అంటగట్టిన అడవి ఒలీవు కొమ్మలు అన్యజాతివారు. వాళ్లు పౌలు బోధవిని యూదుల స్థానాన్ని పొంది దైవ ప్రజల్లో చేరారు. క్రీస్తు నుండి రక్షణంపొందారు. పూర్వం దైవప్రజలైన యూదులు క్రీస్తుని నిరాకరించినందున రక్షణను కోల్పోయారు. మరి వీళ్ల పరిస్థితి ఏమౌతుంది? వీళ్లు శాశ్వతంగా రక్షణను కోల్పోవలసిందేనా?

పౌలు మొదట యూదులతోనే క్రీస్తు సందేశబోధ ప్రారంభించాడు. వాళ్లు క్రీస్తుని నిరాకరించి నందున అన్యుల దగ్గరికి వెళ్లాడు. ఈ యన్యులు క్రీస్తుని విశ్వసించడంమంచిదే. కాని యూదులగతి ఏమౌతుంది? వాళ్లు కలకాలం రక్షణను కోల్పోతారు అనే అంశాన్ని పౌలు భరించలేడు.

అతడు దైవప్రేరణంతోనే ఈలా చెప్పాడు. యూదుల నిరాకరణం కొంతకాలంవరకే. రెండవ రాకడకు ముందు యిస్రాయేలు ప్రజలు క్రీస్తుని విశ్వసిస్తారు. తండ్రి క్రీస్తుద్వారా వారిని కూడ రక్షిస్తాడు. అందరూ రక్షణం పొందాలనే దేవుని కోరిక. కనుక దేవుడు అందరిపై కృప చూపుతాడు -26.

మంచి ఒలీవుపై అడవి ఒలీవు కొమ్మలను అంటుగట్టిన దేవుడు, దానిపై మంచి ఒలీవు కొమ్మలను గూడ అంటుగట్టకలడు. ఈ కొమ్మలే యూదులు. కనుక వీళ్లకు కూడ రక్షణం కలుగుతుంది.